క్లుప్తంగా

సబితకు డాక్టరేట్



హన్మకొండ అర్బన్: నగరంలోని పింగిళి మహిళా ప్రభుత్వ కళాశాలలో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లెఫ్టినెంట్ బుద్దే సబితకు హర్యానా రాష్ట్రంలోని హిస్సార్‌లోని ఓం స్టెర్లింగ్ గ్లోబల్ యూనివర్సిటీ.. రసాయన విభాగంలో డాక్టరేట్ ప్రకటించిందని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ రేణుశర్మ పర్యవేక్షణలో 'స్పెక్ట్రోస్కోపిక్ అండ్ థర్మల్ స్టడీస్ ఆన్ ప్యూర్ అండ్ ఈరేడియేటెడ్ పాలిమర్స్ అండ్ కోపాలిమర్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సబితకు డాక్టరేట్ లభించినట్లు పేర్కొన్నారు. కాగా, తన పరిశోధనకు సహకరించిన ప్రిన్సిపాల్ చంద్రమౌళి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఓఎస్‌జీయూ అధ్యాపకుడు, ప్రొఫెసర్ జలపతి, ఎన్ఐటీ ప్రొఫెసర్లు, కళాశాల మేనేజ్‌మెంట్, అధ్యాపకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

సంచార వైద్య శిబిరం



హసన్‌పర్తి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్ హనుమకొండ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం నాగారంలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం సంచార వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరుణ్ మాట్లాడుతూ ప్రతీ నెలా గ్రామంలో మొబైల్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కిషన్‌రావు, డాక్టర్ మదన్ మోహన్‌రావు, సిబ్బంది శివకుమార్, గంగాధర్, సాగర్, పవన్, సతీష్, రమేష్ పోశాలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భద్రతపై అవగాహన

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ హైదరాబాద్ నేతృత్వంలో ఫైనాన్సియల్ అంశాలపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా కేకే.గంగధర్‌రావు హాజరై మాట్లాడారు. బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఆర్థిక భద్రత, పొదుపు, పెట్టుబడులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సోమయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

కాశిబుగ్గ: వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో సిద్ధి గణపతి, అభయాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం కనులపండువగా సాగింది. రుత్వికులు గణేష్‌శర్మ, శంకరశర్మ, భాస్కరశర్మ, వెంకన్నశర్మ, గోపిశర్మ, సాయిచరణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ దిడ్డి శ్రవణ్, వైద్యులు తిరుపతిరెడ్డి, పోలా నటరాజు, ఉషారాణి, బందెల మోహన్‌రావు, శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్ దుస్సా, మాధవి, సంధ్య, శ్రవణ్, అజిత్, రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక



హన్మకొండ: హనుమకొండ పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు ఎలకంటి రాములు ఆధ్వర్యంలో పబ్లిక్‌గార్డెన్‌లో బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎలకంటి రాములు, తూముల సదానందం, పట్టణ అధ్యక్షుడిగా జంపాల ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సింగారపు శ్యామ్, ఉపాధ్యక్షులుగా గజవెల్లి తిరుపతి, మడిపెల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల సుదర్శన్, కోశాధికారిగా మేడిపల్లి రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా శ్రీరాముల వెంకటేష్, సహాయ కార్యదర్శిగా దుబ్బాకుల సూరయ్య ఎన్నికయ్యారు.

ఈ నెలలో రుణాలు చెల్లించొద్దు



ఖిలా వరంగల్: ఎన్నికల కోడ్ ఉన్నందున పొదుపు పరపతి సంఘాల్లో తీసుకున్న రుణం డబ్బులను డిసెంబర్ నెలలో చెల్లించాలని ఏకశిల పొదుపు పరపతి సంఘం అధ్యక్షుడు బోరిగం నర్సింగం సూచించారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఏకశిల పరపతి సంఘం భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకశిల పరపతి సంఘం, మున్నూరుకాపు పరపతి సంఘం, విజయసాయి పరపతి సంఘం సభ్యులు చెల్లించాల్సిన నవంబర్, డిసెంబర్ నెలల షేర్లు, వడ్డీ డబ్బును ఒకేసారి చెల్లించి తగు రశీదు పొందాలని సూచించారు.

నగరంలో ప్రచారం ముమ్మరం



వాకర్స్‌తో నాయిని రాజేందర్ రెడ్డి



రావు పద్మకు స్వాగతం పలుతున్న మహిళలు



వాకర్స్‌తో మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

హన్మకొండ / కేయూ క్యాంపస్: ఎన్నికలు సమీపిస్తుండడంతో నగరంలో పలు పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. రాష్ట్రంలో అధికార మార్పు తప్పదని, శాసన సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో బుధవారం ఉదయం వాకర్స్‌తో కలిసి రాజేందర్ రెడ్డి వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అధికారంలోకి వస్తే కాంగ్రెస్ పార్టీ ఏం చేస్తుందో చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు.

బీజేపీతోనే వరంగల్ నగరాభివృద్ధి

హన్మకొండ: వరంగల్ మహానగరంలో జరిగిన అభివృద్ధి అంతా బీజేపీతోనేనని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు, బీజేపీ వరంగల్ పశ్చిమ అభ్యర్థి రావు పద్మ అన్నారు. బుధవారం ఉదయం హనుమకొండలోని పోస్టల్ కాలనీ, జులైవాడ, సాయంత్రం కాజీపేటలోని విష్ణుపురి, విద్యానగర్, మహంకాళి ఆలయం వీధి, వడ్డెర బస్తీ, ఏఆర్ఆర్ నగర్ ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రావు పద్మ ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈమేరకు మహిళలు ఆమెకు మంగళహారతులతో స్వాగతం పలికారు. తిలకం దిద్ది, శాలువా కప్పి సన్మానించి తలపాగా ధరింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వరంగల్ మహానగర అభివృద్ధికి స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్ వంటి పథకాలు మంజూరు చేసిందని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ఏడాదికి రూ.300 కోట్లు ఇస్తామని చెప్పి వరంగల్ మహానగర ప్రజలను వంచించారని ఆరోపించారు.



మటన్ కొడుతూ ప్రచారం చేస్తున్న ప్రదీప్‌రావు

ఆదరించండి.. అండగా ఉంటా

హసన్‌పర్తి: ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను ఆదరించి గెలిపించాలని వర్ధన్నపేట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్ కోరారు. ఈమేరకు బుధవారం ఉదయం హసన్‌పర్తి పెద్ద చెరువు వాకర్స్‌ను కలిసి ఓటు అభ్యర్థించారు. తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని చెప్పారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తీరుస్తానని శ్రీధర్ హామీ ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబమే బాగుపడిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మభ్యపెడుతున్న పార్టీలకు బుద్ధి చెప్పాలి

కరీమాబాద్ : పథకాల పేరుతో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మభ్యపెడుతున్నారని బీజేపీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. 42వ డివిజన్ మహంకాళి ఆలయం, నెహ్రూసెంటర్, గంగపుత్ర వీధి, ఖమ్మం మెయిన్ రోడ్డు, గవిచర్ల క్రాస్ రోడ్ ప్రాంతాల్లో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని 9 సంవత్సరాల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. వరంగల్ నగర అభివృద్ధిలో కూడా కేంద్రం భాగస్వామ్యం ఉందని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో జరిగిన అవినీతిని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. అమలుకు నోచుకోని హామీలను మేనిఫెస్టోలో చేర్చి ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు వస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. దేశంలో అవినీతిరహిత పాలన సాగిస్తున్న బీజేపీకి తెలంగాణ రాష్ట్రంలో కూడా ఒక అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆయన కోరారు.

నామినేషన్ల దాఖలుకు హెల్ప్‌డెస్క్



మాట్లాడుతున్న తూర్పు ఆర్‌ఓ రిజ్వాన్‌బాషా

వరంగల్ అర్బన్: నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తూర్పు రిటర్నింగ్ అధికారి రిజ్వాన్‌బాషా అన్నారు. బల్దియా కౌన్సిల్‌హాల్‌లో బుధవారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అదనపు కమిషనర్ రషీద్, ఏసీపీ బోనాల కిషన్, డీసీ కృష్ణారెడ్డి, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. అదే విధంగా వరంగల్ ఎల్బీ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణను ఆయన పరిశీలించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఆర్‌ఓ షేక్‌రిజ్వాన్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ డబ్బులు పంచిన ఘటన సోషల్ మీడియా(వాట్సప్)లో వీడియో వైరల్ అయిన నేపథ్యంలో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తూర్పు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సతీమణి ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘించి ఓటర్లకు డబ్బులు పంచిన ఘటన ట్విట్టర్‌లో ఫొటో వైరల్ అయిన నేపథ్యంలో మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు షేక్ రిజ్వాన్ బాషా పేర్కొన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్‌కు సన్మానం



దయాకర్‌ను సన్మానిస్తున్న పలు విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమితులైన కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్‌ను కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని ఓ బాంక్వెట్ హాల్‌లో పలు విద్యార్థి సంఘాల బాధ్యులు, విద్యార్థులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు గ్రామాలకు వెళ్లి ఓటర్లను చైతన్యం చేసి ఓటింగ్ శాతాన్ని పెంచేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ ఐక్య కార్యచరణ సమితి చైర్మన్ డాక్టర్ తీగల ప్రేమ్‌సుందర్, నాయకులు గుగులోతు రాజునాయక్, గుండేటి సుమన్, మార్క్‌కిరణ్, వడ్డెపెల్లి మధు, ఎండీ.పాషా, కేతపాక ప్రసాద్, స్ఫూర్తి, సరిత, స్నేహ, వినయ్, కోటేశ్వర్, రమేష్, క్రాంతి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్



కేయూ వద్ద కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కేయూ క్యాంపస్: పదేళ్లలో విద్యార్థులు, నిరుద్యోగులకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దేవాచేశారు. రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ -2 అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా వారి జీవితాలతో సీఎం కేసీఆర్ చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వరంగల్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అల్వాల కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమ వినయ్‌కుమార్, బాధ్యులు జన్ను పృథ్వీ, అరుణ్‌రెడ్డి, సెహ్వాగ్, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మీర్జా షంషేర్, ఎండీ.రుకొద్దీన్, ఎండీ.ఫయ్స్, కేయూ విద్యార్థులు ఏసుదాసు, నాగరాజు, నవీన్, సుమన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

హసన్‌పర్తి: పలివేల్పుల క్రాస్‌లోని లార్డ్ అనాథాశ్రమంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవి క్లబ్ హసన్‌పర్తి అధ్యక్షుడు చిదర కరంచంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ఇంటర్నేషనల్ అలయన్స్ క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ లక్ష్మణ్, క్లబ్ కార్యదర్శి శ్యాంసుందర్, కోశాధికారి పువర్దన్, క్లబ్ మాజీ అధ్యక్షులు వెలగందుల భీష్మనాథం, నాగమళ్ల సుధీర్, సంద్రు నాగేందర్ పాల్గొన్నారు.

పార్టీల్లో పలువురు నాయకుల చేరిక

హసన్‌పర్తి: ఎర్రగట్టు దేవస్థాన ధర్మకర్త, యాదవ సంఘం అధ్యక్షుడు వేల్పుల సదానందం బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు ఆయనకు పార్టీ అభ్యర్థి నాగరాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, దేవస్థాన మాజీ చైర్మన్ రవి, మాజీ ఉప సర్పంచ్ బల్సుకూరి శ్రీనివాస్, నాయకులు ప్రకాష్, స్వామి, గొర్రె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

41వ డివిజన్‌లో..

కరీమాబాద్: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆధ్వర్యంలో గ్రేటర్ పరిధిలోని 41వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ సలావుద్దీన్ బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి మురళి ఆహ్వానించారు. సురేఖ గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు.


బీఆర్ఎస్‌లో..

హన్మకొండ: హనుమకొండలోని 4వ డివిజన్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కంజర్ల మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్దమ్మగడ్డలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొంగు అశోక్, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం మద్దతు

హసన్‌పర్తి: వర్ధన్నపేట బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌కు హసన్‌పర్తి గ్రామగౌడ సంఘం మద్దతు ప్రకటించింది. ఈమేరకు ప్రశాంత్‌నగర్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యే రమేష్‌ను సంఘం సభ్యులు బుధవారం కలిశారు. గౌడ సంఘం అధ్యక్షుడు వల్లాల గణేష్, గౌరవ అధ్యక్షుడు వల్లాల యాదగిరి, సంఘం యూత్ అధ్యక్షుడు వల్లాల శ్రీకాంత్, నాయకులు వల్లాల సాంబయ్య దొనికల సారంగం, రఘుపతి, కుమారస్వామి, మూల దేవేందర్, జనగాని సంపత్, వల్లాల గంగాధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తీరుతోనే బీఆర్ఎస్‌కు రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న రవీందర్

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నేత కర్నె రవీందర్.. తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీలోని స్వగృహంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 ఏళ్లుగా పార్టీ కోసం ఎంతగానో సేవ చేశానని, గడిచిన శాసన సభ, గ్రేటర్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించి పార్టీ అభ్యర్థుల విజయంలో భాగమయ్యానని వివరించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్ కేటాయించకున్నా పార్టీ ఆదేశాల మేరకు క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేశానని గుర్తుచేశారు. ఎమ్మెల్యే నియంత పోకడలు, పార్టీలో సీనియర్ నాయకులపై పార్టీ వ్యవహరించే విధానాలు దారుణంగా ఉన్నాయని వాపోయారు. 'నాపై వ్యక్తిగత కక్షతో నా పెద్ద కుమారుడి మీద ఎమ్మెల్యే.. తన అనుచరులతో దాడి చేయించారు' అని రవీందర్ చెప్పారు. పార్టీ అధిష్టానానికి ఆయన వైఖరిపై అనేక సార్లు ఫిర్యాదు చేసినా లాభం లేదని, అందుకే ఎమ్మెల్యే నరేందర్ తీరును వ్యతిరేకిస్తూ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

కాజీపేట అర్బన్: బీఆర్ఎస్ నాయకులు బుధవారం పలు డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దాస్యం వినయ్‌భాస్కర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ 31వ డివిజన్ న్యూశాయంపేటలోని కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జేసీబీ అడ్డా, నందిహిల్స్, దీన్‌దయాళ్‌నగర్, జ్యోతిరావు పూలే నగర్‌లలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, జానకీరాములు, వేణుగోపాల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

9వ డివిజన్‌లో..

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సుధానగర్, న్యూరాయపుర కాలనీల్లో ఇల్లిల్లు తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. దాస్యం వినయ్‌భాస్కర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ.నజీర్, సముద్రాల రవి, చెన్న ప్రకాష్, మహేశ్వరం గిరి, కిశోర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో..

కాజీపేట రూరల్: వరంగల్ పశ్చిమ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపు కోసం కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్‌లో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ సంకు నర్సింగరావు, 147వ పోలింగ్ బూత్ కెప్టెన్ శ్రీనివాస్, 151వ పోలింగ్ బూత్ కెప్టెన్ మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు.

పాపయ్యపేటలో..

రామన్నపేట: పాపయ్యపేటలోని బూత్ నంబర్ 92 పరిధిలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని కోరారు. కల్పలత సూపర్‌బజార్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ, 92వ బూత్ కెప్టెన్ మాల్యే రాజు, ఎస్కే ముజీబ్, ఎండీ రఫీ, ఎస్కే రహమాన్, తహసీన్, జమీర్, అఖిల్, సాయి, చరణ్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో సీపీఐ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేలిముద్ర (బయో మెట్రిక్) విధానం ద్వారా ఆధార్ ప్రమాణీకరణ చేయించుకోవాలని, నాణ్యమైన పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకొని వచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. డిప్యూటీ మేనేజర్ సీపీఐ దావే, అసిస్టెంట్ మేనేజర్ సచిన్ షిండే, మల్లేశం, అజ్మీర రాజు, ప్రసాద్‌రావు, బీవీ.రాహుల్, బియాబాని, శ్రీరామోజు రాము, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సందర్శన



చెన్నారం గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సతీష్, సీఐ క్రాంతికుమార్

మామునూరు: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తిమ్మాపురం, అల్లీపురం, చెన్నారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌తో కలిసి మామునూరు ఏసీపీ సతీష్ బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రతాపరమైన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, భద్రతాపరమైన చర్యలు గురించి సీఐ క్రాంతికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక తనిఖీలు, భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల జరిగేలా అన్ని రాజకీయ పార్టీలను కోరాలని ఏసీపీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణవేణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరులను స్మరించుకుందాం..



అమరులకు జోహార్లు అర్పిస్తున్న నాయకులు

వరంగల్ అర్బన్: భూమి, భుక్తి విముక్తి కోసం పోరాడి అసువులు బాసిన అమరులను స్మరించుకుంటూ గ్రామగ్రామాన సంస్మరణ సభలు నిర్వహించాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం పిలుపునిచ్చారు. వరంగల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సీపీఐ (ఎంఎల్) నర్సంపేట జోనల్ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ భారత విప్లవ పోరాటాల్లో ఎంతో మంది అమరులయ్యారని గుర్తుచేశారు. ఉన్నత చదువులు, ఉద్యోగాలు, కుటుంబాలను వదిలి భూమి, భుక్తి, విముక్తి కోసం, ఆదివాసీ, గిరిజన, దళిత, బహుజన హక్కుల కోసం పోరాటాలు చేశారని కొనియాడారు. కొంతమంది అనారోగ్యాలతో మరణించగా, మరి కొంతమంది బూటకపు ఎన్‌కౌంటర్‌లలో అసువులు బాసారని ఆవేదన వ్యక్తం చేశారు. విప్లవోద్యమాలను అణిచివేయాలనుకునే పాలకుల కుటిల ఎత్తుగడలను ఎండగట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. అమరవీరుల పోరాటచరిత్ర నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బైరబోయిన అయిలయ్య, కృష్ణ, ఘంటా శంకర్, క్రాంతి, సమ్మయ్య, కళావతి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్: రోజూ ఆహారంతో పాటు చిరుధాన్యాలను కూడా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.బలరామ్ తెలిపారు. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్ -2023 భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై పెద్దమ్మ గడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ భార్గవి, గోపిక తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ వేణు

కాజీపేట అర్బన్: సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండి జాగ్రత్తగా ఉండాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు అన్నారు. సైబర్ క్రైమ్స్‌పై అవగాహన సదస్సును 45వ డివిజన్ పరిధిలోని తరాలపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని చెప్పారు. అలాగే, ఆపద సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, బాల్యవివాహ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు.

హత్యాయత్నాన్ని ఖండిస్తున్నాం

ఖిలా వరంగల్: దుబ్బాక ఎంపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం, హత్యా రాజకీయలను వరంగల్ ప్రజల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చెప్పారు. ఈమేరకు శివనగర్‌లోని సాయి కాన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ప్రభాకర్‌పై కాంగ్రెస్ పార్టీ హత్యాయత్నం చేసిందని ఆరోపించారు. అధికారులు దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్పొరేటర్లు కావేటి కవిత, దిడ్డి కుమారస్వామి, చింతాకుల అనిల్, మరుపల్లి రవి, సోమిశెట్టి ప్రవీణ్, పుర్కాన్ పాల్గొన్నారు.